క్లుప్తంగా

పారిశుద్ధ్య కార్మికులకు సమ దుస్తుల పంపిణీ



గుడ్లవల్లేరు: గుడివాడ అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలోని గుడివాడ, నందివాడ, గుడ్లవల్లేరు మండలాల్లోని వివిధ గ్రామ పంచాయతీల్లో పని చేస్తున్న 285 మంది పారిశుద్ధ్య కార్మికులకు యూనిఫామ్స్, కిట్లు (ప్రాథమిక చికిత్స సామగ్రి, సబ్బులు, మందులు) గుడ్లవల్లేరులో పంపిణీ చేశారు. రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రావి వెంకటేశ్వరరావు ముఖ్యఅతిథిగా కార్మికులకు యూనిఫామ్, కిట్లు అందజేశారు. డీఎల్‌పీఓలు సునీత శర్మ, సంపత్ కుమార్, ఎంపీడీవో ఎండీ ఇమ్రాన్, మూడు మండలాల డిప్యూటీ ఎంపీడీవోలు, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది, పారిశుద్ధ్య కార్మికులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులు ప్రారంభం



గుడ్లవల్లేరు: జల్‌జీవన్ పథకం కింద స్థానిక ఎన్టీఆర్ కాలనీలో రూ.95 లక్షలు, జగనన్న కాలనీలోని రూ.1.65 కోట్ల విలువైన పనులను పూర్తి చేశారు. మంచినీటి పథకంతో పాటు రూ.13.78 లక్షల స్కూల్ భవనాన్ని ఎమ్మెల్యే వెనిగండ్ల రాము ప్రారంభించారు. మాజీ జెడ్పీటీసీ కొసరాజు బాపయ్య చౌదరి, వేర్ హౌస్ చైర్మన్ రావి వెంకటేశ్వరరావు, గుడ్లవల్లేరు ఏఎంసీ చైర్మన్ పొట్లూరి రవికుమార్, పోలవరపు వెంకట్రావు, పీఏసీఎస్ అధ్యక్షుడు వెనిగెళ్ల నాగేశ్వరరావు, కళ్యాణపు నవాబు, వైపీసీ ప్రసాద్, గ్రామస్తులు పాల్గొన్నారు.

కనులపండువగా ఊంజల్ సేవ



గుడ్లవల్లేరు: దసరా నవరాత్రుల్ని పురస్కరించుకుని మండలంలోని డోకిపర్రు భూ సమేత శ్రీ వెంకటేశ్వర స్వామివారి సన్నిధిలో అమ్మవారికి ఊంజల్ సేవను వేద మంత్రోచ్ఛరణ నడుమ కనుల పండువగా నిర్వహించారు. మెయిల్ అధినేత, దేవస్థాన వ్యవస్థాపక ధర్మకర్తలు పురిటిపాటి వెంకట కృష్ణారెడ్డి, సుధారెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించే ఈ కార్యక్రమానికి భక్తులు తండోపతండాలుగా విచ్చేసి అమ్మవారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలను స్వీకరించారు.

ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడి నియామకం



పామర్రు: మాదిగలు ఐక్యంగా ఉన్నప్పుడే వారి సమస్యలు పరిష్కారం అవుతాయని ఎమ్మార్పీఎస్ కృష్ణా జిల్లా ఇన్‌చార్జి జలదంకి నరసింహారావు పేర్కొన్నారు. స్థానిక ఆర్ అండ్ బీ గెస్టు హౌస్‌లో పామర్రు నియోజకవర్గ సమావేశం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి (ఎమ్మార్పీఎస్) ద్వారా గ్రామీణ ప్రాంతాలలోని ప్రతి ఒక్కరినీ చైతన్య పర్చాలని అన్నారు. అనంతరం పామర్రు మండల ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడిగా జువ్వనపూడి భాస్కరరావుకు నియామకపు పత్రాన్ని ఆయనకు అందజేశారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ మ్మార్పీఎస్ నాయకులు, జిల్లా కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

సుబ్బారాయుడికి అభిషేకాలు



ముదినేపల్లి రూరల్: ప్రసిద్ధి చెందిన సింగరాయపాలెం–చేవూరుపాలెం సెంటర్‌లోని శ్రీసుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయంలో స్వామివారికి మంగళవారం అభిషేకాలు నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకుడు తోలేటి వీరభద్రశర్మ ఆధ్వర్యంలో స్వామికి ప్రత్యేక పూజలు ఇతర కార్యక్రమాలు నిర్వహించి అభిషేకాలు చేశారు. భక్తులు స్వామివారి పుట్టలో పాలు పోసి, నాగబంధాల వద్ద పూజలు చేసి అభిషేకాలు చేయించుకున్నారు. భక్తుల రద్దీకి అనుగుణంగా నిత్యాన్నదాన ప్రసాదానికి సంబంధించి అధికారులు తగిన ఏర్పాట్లు చేశారు. ఆలయ ఈవో ఆర్.గంగాశ్రీదేవి, సిబ్బంది పర్యవేక్షణ చేశారు.

దుర్గామాతా.. పాహిమాం

గుడివాడ, పామర్రు, కైకలూరు నియోజకవర్గాల్లో దేవీశరన్నవరాత్రి ఉత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. తొమ్మిదవ రోజు మంగళవారం అమ్మవారు శ్రీదుర్గాదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఆయా గ్రామాల్లో ఉత్సవ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో అమ్మవారి ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తున్నారు.

– గుడివాడరూరల్/గుడ్లవల్లేరు/పామర్రు/గుడివాడ టౌన్/కైకలూరు



గుడివాడ కోతిబొమ్మ సెంటర్‌లో శ్రీదుర్గాదేవిగా అమ్మవారు



వలివర్తిపాడు రోడ్‌లో శ్రీకనకదుర్గాదేవిగా భక్తులకు దర్శనం



వేమవరంలో శ్రీ కనకదుర్గా దేవిగా దర్శనమిచ్చిన కొండలమ్మ



అంగలూరు జ్ఞానసాయి మందిరంలో శ్రీ కనకదుర్గా దేవిగా



పామర్రు బుచ్చమ్మ ఆశ్రమంలో కనకదుర్గా దేవి అలంకారం



పామర్రులో కనకదుర్గా దేవిగా కన్యకా పరమేశ్వరీ దేవి



కైకలూరు శ్యామలాంబ దేవాలయంలో భక్తుల పూజలు



గుడివాడటౌన్ భీమేశ్వర స్వామి దేవస్థానంలో కనకదుర్గా దేవిగా



ఆటపాకలో దుర్గాదేవి అలంకరణలో కనకదుర్గమ్మ

రోడ్డంతా గుంతలు.. ప్రయాణానికి ఇబ్బందులు



చెరువును తలపిస్తున్న కొత్త బైపాస్‌రోడ్డు

గుడివాడ టౌన్: స్థానిక ఏలూరు రోడ్ నుంచి బంటుమిల్లి రోడ్డును కలిపే కొత్త బైపాస్ రోడ్డు గుంతలమయమైంది. ఈ మార్గంలో ప్రయాణం చేయాలంటే భయం వేస్తోందని ప్రయాణికులు అంటున్నారు. మూడున్నర కిలోమీటర్ల పొడవున్న ఈ రోడ్డులో పలు ప్రాంతాల్లో భారీ గుంతలు ఏర్పడ్డాయి. వర్షం నీరు నిలిచి ఏ గొయ్యి ఎంత లోతు ఉందో తెలియక వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. ఇక టూ వీలర్ ప్రయాణికుల సంగతి వర్ణణాతీతం. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఈ ఏడాది ప్రారంభంలో రూ.80 లక్షలు వెచ్చించి తూతూమంత్రంగా గోతులు పూడ్చారు. సమస్య పరిష్కరించామని కూటమి నాయకులు ర్యాలీ నిర్వహించి హడావుడి చేశారు. ఏడాది తిరగకముందే పాత గుంతలను తలతన్నేలా పెద్ద గుంతలు ఏర్పడ్డాయి. అధికారులు, కూటమి ప్రభుత్వ ప్రజాప్రతినిధులు స్పందించి బైపాస్ రోడ్డును బాగుచేయించాలని ప్రయాణికులు కోరుతున్నారు.

ఉపాధ్యాయుడిగా ఎంపికైన కానిస్టేబుల్‌కు సత్కారం



డీఎస్సీకి ఎంపికైన కానిస్టేబుల్ శ్రీహరిని సత్కరిస్తున్న ఎస్‌ఐ చంటిబాబు

గుడివాడరూరల్: కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తూ ఇటీవల ప్రభుత్వం నిర్వహించిన మెగా డీఎస్సీలో గుడివాడ తాలూకా పోలీస్ స్టేషన్‌కు చెందిన కానిస్టేబుల్ బంకురు శ్రీహరి ఎంపిక కావడం అభినందనీయమని తాలూకా ఎస్‌ఐ ఎన్.చంటిబాబు పేర్కొన్నారు. స్థానిక పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వహిస్తూ ఉపాధ్యాయుడిగా ఎన్నికైన శ్రీహరిని ఎస్‌ఐ, స్టేషన్ అధికారులు, సిబ్బంది మంగళవారం ఘనంగా సత్కరించి అభినందించారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ చంటిబాబు మాట్లాడుతూ కానిస్టేబుల్‌గా మెరుగైన సేవలు అందించిన శ్రీహరి ఉపాధ్యాయుడిగా మరింత మంచి సేవలు అందించాలని ఎస్‌ఐ ఆకాంక్షించారు. కానిస్టేబుల్ శ్రీహరిని ఉన్నతాధికారులు అభినందనలు తెలిపారన్నారు. ప్రస్తుతం పోలీస్ శాఖ నుంచి శ్రీహరి రిలీవ్ అవుతున్నారన్నారు. మరింత ఉన్నత స్థానాలకు ఎదగాలని ఎస్‌ఐ కోరారు. కార్యక్రమంలో పోలీస్ అధికారులు, స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

అంబేడ్కర్ గుడివాడ సందర్శించి 81 ఏళ్లు పూర్తి

ఘనంగా నివాళులర్పించిన నాయకులు



అంబేడ్కర్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

గుడివాడ టౌన్: భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గుడివాడ పట్టణానికి విచ్చేసి 81 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా ఆయన చిత్రపటం వద్ద పలు దళిత సంఘాల నాయకులు ఘన నివాళులు అర్పించారు. స్థానిక రాజేంద్రనగర్‌లోని అంబేడ్కర్ భవన్‌లో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. 1944 సెప్టెంబర్ 30వ తేదీన ఆయన పట్టణానికి విచ్చేయగా 54 ఎడ్లబండ్లతో ఆయనకు స్వాగతం పలికారని నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో దళిత నాయకులు పొంగులేటి జయరాజు, పి.సురేష్, నీలం ప్రభాకర్, దారం నరేంద్ర, బొడ్డు విల్సన్, బి.సువర్ణరాజు, డి.కోటిబాబు, ఎస్.విజయ్ తదితరులు పాల్గొన్నారు.

3 నుంచి డీఎస్సీ అభ్యర్థులకు ఇండక్షన్ శిక్షణ

మచిలీపట్నంఅర్బన్: ఉమ్మడి కృష్ణా జిల్లాకు సంబంధించిన మెగా డీఎస్సీ–2025లో ఎంపికైన 1,203 మంది అభ్యర్థులకు ఇండక్షన్ శిక్షణ కార్యక్రమం అక్టోబర్ 3 నుంచి 10వ తేదీ వరకు నిర్వహిస్తున్నట్లు కృష్ణా జిల్లా విద్యాశాఖాధికారి పీవీజే రామారావు మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. అభ్యర్థులు తమకు కేటాయించిన కేంద్రాల్లో తప్పనిసరిగా హాజరుకావాలన్నారు. కేంద్రాల వారీగా స్కూల్ అసిస్టెంట్లు(తెలుగు, హిందీ, ఆంగ్లం, సంస్కృతం, ఉర్దూ, బయోసైన్స్, గణితం, ఫిజికల్ సైన్స్), ఎస్జీటీ(ఉర్దూ) విభాగాల్లో ఎంపికైన 945 మంది అభ్యర్థులకు శిక్షణ కృష్ణా జిల్లా పామర్రులోని ప్రగతి ఎడ్యుకేషనల్ ఇనిస్టిట్యూషన్లలో ఏర్పాటు చేశారని తెలిపారు. అలాగే స్కూల్ అసిస్టెంట్లు(సామాజికం, ఫిజికల్ ఎడ్యుకేషన్) విభాగాల్లో ఎంపికైన 258 మంది అభ్యర్థులకు ఎన్టీఆర్ జిల్లా తిరువూరు మండలంలోని వాహిని ఇనిస్టిట్యూట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ కేంద్రంగా జరుగుతుందన్నారు. ఈ శిక్షణ కార్యక్రమం ఎనిమిది రోజుల పాటు కొనసాగుతుందని, శిక్షణ పూర్తయిన అనంతరం మాత్రమే నియామక ఉత్తర్వులు జారీ చేస్తామన్నారు. శిక్షణకు హాజరయ్యే అభ్యర్థులు అవసరమైన వ్యక్తిగత సామగ్రి, దుప్పట్లు, జాగింగ్ షూస్, ఆండ్రాయిడ్ మొబైల్ ఫోన్లు తెచ్చుకోవాలన్నారు. అలాగే ఫార్మల్ డ్రెస్ కోడ్ తప్పనిసరిగా పాటించాలని, ఆరోగ్య సమస్యలకు కావలసిన మందులు తీసుకువచ్చుకోవాలని రామారావు సూచించారు.

డీఎస్సీలో ఉద్యోగాలు సాధించిన వారికి సత్కారం



ఉద్యోగాలు సాధించిన వారిని సన్మానిస్తున్న పూర్వ విద్యార్థుల అసోసియేషన్ సభ్యులు

చల్లపల్లి: స్థానిక శ్రీమంతురాజా యార్లగడ్డ శివరామప్రసాద్ కళాశాలలో చదివి తాజాగా విడుదలైన డీఎస్సీలో ఉపాధ్యాయ పోస్టులు పొందిన పలువురిని కళాశాల పూర్వ విద్యార్థుల అసోసియేషన్ ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా సన్మానించారు. స్కూల్ అసిస్టెంట్లుగా ఉద్యోగాలు సాధించిన కె.ఎల్.సునంద, యడ్ల నాగలక్ష్మి, వై.లెనిన్, బి.రమాంజలి, ఆర్.సీతారామయ్య, ఆర్.మధుబాబులను, ఎస్జీటీగా ఉద్యోగాలు సాధించిన పి.శ్రీనివాసరావులను ఘనంగా సత్కరించారు.

అసోసియేషన్ గౌరవ అధ్యక్షుడు తగరిశ సాంబశివరావు అధ్యక్షతన జరిగిన సభలో రిటైర్డ్ మాజీ ప్రిన్సిపాల్ ఎన్.వి.నరసింహారావు, అధ్యాపకులు సూర్యదేవర నాగేశ్వరరావు పాల్గొన్నారు. తమ వద్ద విద్యాబుద్ధులు నేర్చుకున్న నాటి విద్యార్థులు నేడు ఉపాధ్యాయులుగా భావిభారత పౌరులను తీర్చిదిద్దే గురువులుగా ఎదగటం తమకు ఎంతో గర్వకారణంగా ఉందని పేర్కొన్నారు. కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షులు గోవిందరాజుల అశ్విన్‌కుమార్, కొండవీటి నాగరాజు, నడకుదురు లీలాబ్రహ్మేంద్ర, చింతల శ్రీనివాసరావు, సుభాషిణి, దుర్గాప్రసాద్, సీతారామ, పోతురాజు, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఆలయాల పునర్నిర్మాణానికి విరాళం

గుడ్లవల్లేరు: స్థానిక రమా సహిత సత్యనారాయణ స్వామి, శ్రీ గంగానమ్మ తల్లి దేవస్థానాల పునర్నిర్మాణ పనులకు మంగళవారం దాత వల్లభనేని శివశంకర వరప్రసాద్ కుమారుడు హరీష్ రూ.20 వేలను అందించారు. గుడ్లవల్లేరు ఏఎంసీ చైర్మన్ పొట్లూరి రవికుమార్, నెహ్రూ పశువుల సంత కమిటీ కార్యదర్శి ఈడ్పుగంటి ఉమా, సభ్యులు పోలవరపు వెంకట్రావు, చాపరాల సుధాకర్, పీఏసీఎస్ అధ్యక్షుడు వెనిగెళ్ల నాగేశ్వరరావు, దేవస్థాన ధర్మకర్తలు మురాల నరేష్, రవి తదితరులు పాల్గొన్నారు.

ప్రాథమిక ఆరోగ్యం కేంద్రం పరిశీలన

కలిదిండి(కైకలూరు): కలిదిండి మండలం మూలలంక పీహెచ్‌సీని ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్ మంగళవారం పరిశీలించారు. ఆరోగ్య సిబ్బంది స్టోర్ రూం, వామర్ బాక్స్ అవసరమని డాక్టర్ నస్రీన్ కోరారు. ఎమ్మెల్యే వాటిని సమకూరుస్తామని చెప్పారు. అనంతరం సంతోషపురం, భాస్కరరావుపేట, మూలలంక గ్రామాల్లో సీసీ రోడ్లను ప్రారంభించారు. భాస్కరరావుపేటలో ఎంబీబీఎస్ పీజీలో 12వ ర్యాంకు సాధించిన పాల భానుశ్రీని సన్మానించారు. తర్వాత భాస్కరరావుపేటలో ఏర్పాటు చేసిన దసరా పందిరిలో అమ్మవారికి పూజలు చేశారు. కార్యక్రమంలో కూటమి నేతలు పాల్గొన్నారు.

వీరాంజనేయుని ఆలయంలో పూజలు

పామర్రు: ఉండ్రపూడి– పోలవరం అడ్డరోడ్డు వద్ద వేంచేసియున్న వీరాంజనేయస్వామి ఆలయంలో ఆశ్వయుజ మాసం మంగళవారం కావడంతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. తొలుత ఆలయంలో స్వామికి విశేషంగా పంచామృతాలతో నవరసాలతో అభిషేకాలను చేశారు. స్వామికి శత సహస్ర నామాలతో పూజా కార్యక్రమాలను నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో మహిళలు స్వయంగా ప్రసాదాలను వండి స్వామికి నివేదనలుగా సమర్పించి మొక్కులను తీర్చుకున్నారు. కొత్త వాహనాలకు పూజలను జరిపించారు. ఆలయంలో పూజా కార్యక్రమాలను ఆలయ అర్చకుడు అగ్నిహోత్రం దినకర్ ఆధ్వర్యంలో నిర్వహించామని ఆలయ ఈవో వర ప్రసాదరావు తెలిపారు. సహాయ అర్చకుడు ఫణికుమార్ శర్మ, సుబ్బారావు పాల్గొన్నారు.

విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌లో మంటలు



మచిలీపట్నంటౌన్: నగరంలోని 46వ డివిజన్ పంచాయతీరాజ్ కాలనీలో పార్కు వద్ద ఉన్న ట్రాన్స్‌ఫార్మర్‌లో మంగళవారం ఒక్కసారిగా మంటలు వ్యాపించాయి. గమనించిన స్థానిక యువకులు మంటలను ఆర్పే ప్రయత్నం చేశారు. ఆ తరువాత విద్యుత్‌శాఖ సిబ్బంది వచ్చి మరమ్మతు పనులు చేపట్టారు. ఇంటర్నల్ సమస్య కారణంగా మంటలు వ్యాపించాయని ఏఈ నవీన్‌రెడ్డి చెప్పారు. లోడ్ సర్దుబాటు చేసి సరఫరా పునరుద్ధించామని, త్వరలో కొత్త ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేస్తామన్నారు.

ప్రకృతి వ్యవసాయంతో ఆరోగ్య సంరక్షణ



ముదినేపల్లి రూరల్: ప్రకృతి వ్యవసాయంతో ఆరోగ్య సంరక్షణ చేకూరుతుందని ప్రకృతి వ్యవసాయ యూనిట్ ఇన్‌చార్జి గౌతమ్‌కుమార్ అన్నారు. మండలంలోని కొత్తదళితవాడలో ఐసీఆర్పీ అనూష ఆధ్వర్యంలో ప్రకృతి వ్యవసాయంలో భాగంగా పెరటి తోటల పెంపకంపై మంగళవారం ప్రయోగాత్మకంగా అవగాహన కల్పించారు. ప్రకృతి వ్యవసాయంలో ఆకుకూరలు, తీగజాతులు, దుంపజాతులు, కూరగాయల మొక్కలు నాటి అవగాహన కల్పించారు.

3న సీజ్ చేసిన వాహనాల వేలం

కోనేరుసెంటర్: సీజ్ చేసిన వాహనాలకు ఈ నెల 3న వేలం నిర్వహించనున్నట్లు మచిలీపట్నం ఎక్సైజ్ సీఐ లక్ష్మణరావు మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. వివిధ కేసులకు సంబంధించి స్టేషన్ పరిధిలో ఐదు ద్విచక్ర వాహనాలకు సీజ్ చేయగా ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ ఆదేశాల మేరకు వేలం నిర్వహిస్తున్నామన్నారు. రూ.1000 రుసుంగా చెల్లించి వేలంలో పాల్గొనాలన్నారు.

కొండలమ్మ సన్నిధిలో అంబరాన్నంటిన సంబరం



చిన్నారుల కోలాట ప్రదర్శన

గుడ్లవల్లేరు: వేమవరం శ్రీ కొండలమ్మ అమ్మవారి సన్నిధిలో దుర్గాష్టమి సంబరాలు అంబరాన్నంటాయి. ఆలయ ఈఓ ఆకుల కొండలరావు, ధర్మకర్తల మండలి చైర్మన్ ఈడే వెంకట విష్ణు మోహన్ రావు ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన అమ్మవారి ఊరేగింపులో గుడివాడ ఎమ్మెల్యే వెనిగండ్ల రాము పాల్గొన్నారు. జానపద ఇంద్రజాల ప్రదర్శనలు, చిత్ర విచిత్ర శక్తి వేషధారణలు, కనక డప్పుల వాయిద్యాలు, మేళతాళాలు, తీన్‌మార్ డప్పులు, చిన్నారుల కోలాట ప్రదర్శన, కేరళ వాయిద్యాలు, గరగ నృత్యాలు భక్తులను ఆకట్టుకున్నాయి. పళ్లు, టెంకాయలను మహిళా భక్తులు సమర్పించారు. అమ్మవారి సన్నిధిలో కుంభం పోసి వేలాది మందికి అన్నసమారాధన చేపట్టారు. అధికసంఖ్యలో భక్తులు విచ్చేసి అమ్మవారిని దర్శించుకుని అన్న ప్రసాదాలను స్వీకరించారు. రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రావి వెంకటేశ్వరరావు, సాగునీటి డీసీ చైర్మన్ మల్లిపెద్ది సుబ్రహ్మణ్యం, ఏఎంసీ మాజీ చైర్మన్ వల్లభనేని వెంకట్రావు, మాజీ సర్పంచి కొడాలి రామరాజు, చేకూరి జగన్మోహనరావు, తొలి ఆలయ మేనేజర్ జక్కా ధర్మారాయుడు, దేవస్థాన సభ్యులు తూము రాజ్యలక్ష్మి, కళ్ళేపల్లి సుగుణ శేఖర్, వడ్లమూడి రవీంద్ర బాబు, పెద్దిబోయిన శ్యామలా దేవి, ఎక్స్ అఫీషియో మెంబర్ రుద్రపాక శరశ్చంద్ర శివ సంతోష్ శర్మ పాల్గొన్నారు.

వరదతో లంక గ్రామాలకు ప్రమాదం లేదు



తోట్లవల్లూరు మండలంలో లంక గ్రామాన్ని పరిశీలిస్తున్న తహసీల్దార్ కుసుమ కుమారి

పామర్రు(తోట్లవల్లూరు): మండల పరిధిలోని లంక గ్రామాలకు ప్రస్తుతం వస్తున్న కృష్ణానది వరద వలన ఎటువంటి ప్రమాదం లేదని తోట్లవల్లూరు మండల తహసీల్దార్ కుసుమ కుమారి అన్నారు. తోట్లవల్లూరు మండలం పరిధిలోని పాములలంక, పిల్లి వాని గూడెం గ్రామాలను పరిశీలించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రస్తుతం కృష్ణానదిలో 6.60 లక్షల క్యూసెక్కుల వరకు వరద వస్తోందన్నారు. ఈ వరద 7 లక్షలు క్యూసెక్కులు దాటితే ఆలోచించాలని తెలిపారు. తోట్లవల్లూరు మండలంలో నాలుగు పునరావాస కేంద్రాలు సిద్ధంగా ఉన్నాయన్నారు. వరద ఉధృతి పెరిగితే లంక గ్రామాల ప్రజలను తరలించేందుకు ఏర్పాట్లు చేశామని తెలిపారు. కృష్ణానది పరీవాహక పల్లపు ప్రాంతాలలో సుమారు 100 ఎకరాలలో కూరగాయల తోటలు నీట మునిగాయని తెలిపారు. ఇంకా వివరాలను సంబంధిత అధికారులు సేకరిస్తున్నారని చెప్పారు. ఈకార్యక్రమంలో రెవెన్యూ అధికారులు, లంక గ్రామాల ప్రజలు పాల్గొన్నారు.

ఓటర్ల జాబితా లోపాలపై సంతకాల సేకరణ



కైకలూరులో సంతకాల సేకరణలో నియోజకవర్గ పార్టీ ఇన్‌చార్జి నోబుల్

కైకలూరు: దేశ వ్యాప్తంగా కాంగ్రెస్ పార్టీ తలపెట్టిన సంతకాల స్వీకరణ కార్యక్రమాన్ని నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి బొడ్డు నోబుల్ కైకలూరులో మంగళవారం ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ కేంద్రంలో నరేంద్ర మోడీ ప్రభుత్వం ప్రజాస్వామ్య విలువలకు తిలోదకాలిస్తూ, ప్రజాస్వామ్యాన్ని అవమానిస్తూ, ప్రజల ఓటును దోచుకుందని విమర్శించారు. ఓట్ చోరీ విషయాన్ని ప్రజల సంతకాలతో ప్రజాస్వామ్యాన్ని కాపాడటానికి అందరూ ముందుకు రావాలని కోరారు. కాంగ్రెస్ పార్టీ బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు కట్టా నాగరాజు గౌడ్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఈదా పద్మారావు, జిల్లా మైనార్టీ సెల్ అధ్యక్షుడు సయ్యద్ రహమాన్, జిల్లా క్రిస్టియన్ సెల్ అధ్యక్షుడు ఇంటూరి ప్రకాష్‌రావు, నజారుద్దీన్ పాల్గొన్నారు.

ఘనంగా అంబేడ్కర్ కాంస్య విగ్రహావిష్కరణ



అంబేడ్కర్ విగ్రహావిష్కరణ కార్యక్రమంలో నేతలు

గుడివాడ టౌన్: భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కాంస్య విగ్రహావిష్కరణ మంగళవారం రాత్రి జరిగింది. గుడివాడ కేంద్ర బిందువైన నెహ్రూచౌక్‌లో ఈ విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. గుడివాడ ఎమ్మెల్యే వెనిగండ్ల రాము విగ్రహావిష్కరణ చేశారు. గుడివాడ నియోజకవర్గ దళితుల దశాబ్దాల కల నేటికి నెరవేరిందని దళిత సంఘాల నాయకులు అన్నారు. అంబేడ్కర్ అందరికీ స్ఫూర్తి అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యేలు తెనాలి శ్రవణ్ కుమార్, వర్ల రామయ్య, పలు దళిత సంఘాల నాయకులు, అభిమానులు పాల్గొన్నారు.